రద్దీప్రాంతాల్లో వాహనాలను క్రమబద్ధీకరించాలి

● డీసీపీ సుబ్బారాయుడు

బంజారాహిల్స్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ అధికంగా ఉండే పీక్ సమయాల్లో ఎస్‌ఐలు, సిబ్బంది ప్రధాన జంక్షన్ వద్ద ఉండి వాహనాలను క్రమబద్ధీకరించాలని ట్రాఫిక్ డీసీపీ సుబ్బారాయుడు అభిప్రాయపడ్డారు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా ట్రాఫిక్ ప్రభావం చాలా ప్రాంతాల్లో ఉంటుందన్నారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు చౌరస్తాలో ఆయన పంజాగుట్ట ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్‌తో కలిసి శుక్రవారం పర్యటించారు. జంక్షన్లలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ తీరుపై అడిగి తెలుసుకున్నారు. ఫ్రీ లెఫ్ట్ అమలుపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నగరంలో అత్యంత రద్దీ ఉన్న జంక్షన్‌గా జూబ్లీహిల్స్ గుర్తింపు పొందిదన్నారు. ఉదయం, సాయంత్రం మాత్రం కాస్త ట్రాఫిక్ జాం ఏర్పడుతున్నట్టు ఫిర్యాదులు అందడంతో ఈ సమస్యను అధిగమించేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. వీఐపీ మూవ్‌మెంట్ అధికంగా ఉండడంవల్ల సమస్య తలెత్తుతుందని, ఇకనుంచి ట్రాఫిక్ సిబ్బంది రద్దీగా ఉండే సమయంలో జంక్షన్‌లో విధులు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. ఫ్రీ లెఫ్ట్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్టు వివరించారు. ట్రాఫిక్ నిబంధనలపై వాహన చోదకుల్లో అవగాహన పెంచేందుకు పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులో సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ సుబ్బారాయుడు, ఏసీపీ కట్టా హరిప్రసాద్

మద్యం మత్తులో సెక్యూరిటీ గార్డుపై దాడి

బంజారాహిల్స్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో రెచ్చిపోయిన యువకుడు సెక్యూరిటీ గార్డుపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. వెంకటగిరికి చెందిన అనిల్‌కుమార్ అన్నపూర్ణ స్టూడియోలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నా డు. రోజు మాదిరిగా ఈనెల 11న విధులకు హాజరయ్యాడు. అర్ధరాత్రి సమయంలో ఇందిరానగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ శ్రీకాంత్ స్టూడియో వద్దకు వచ్చాడు. మద్యం మత్తులో దుర్భాషలాడాడు. స్టూడియో గేటు మీద పెద్ద బండ రాయి వేశాడు. శబ్దం రావడంతో అక్కడే కాపలాగా ఉన్న అనిల్‌కుమార్ గేటు తెరవగా శ్రీకాంత్ తనతో తెచ్చుకున్న కర్రతో దాడి చేశాడు. అనిల్‌కుమార్ తలకు తీవ్ర గాయం అవ్వడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. మిగతా సెక్యూరిటీ గార్డులు అనిల్‌ను ఆస్పత్రికి తరలించి శ్రీకాంత్‌ను పట్టుకొని జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు శ్రీకాంత్‌పై సెక్షన్ 326 ఐపీసీ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేపీహెచ్‌బీలో సెక్యూరిటీ గార్డు మృతి

హైదర్‌నగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీలో సెక్యూరిటీ గార్డు మృతి చెందాడు. యూసఫ్‌గూడ జవహర్‌నగర్‌లో నివాసం ఉండే వనం శ్రీనివాస్(55) సెక్యూరిటీ గార్డుగా పని చేసున్నాడు. శ్రీనివాస్ మద్యానికి బానిసై ఇంటి నుంచి బయటకు వెళ్లి రెండు, మూడు నెలల తర్వాత ఇంటికి వచ్చేవాడు. మద్యం తాగడంవల్ల పదేళ్లుగా అతడి ఆరోగ్యం బాగాలేదు. ఈ క్రమంలో జనవరిలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. గురువారం రాత్రి కేపీహెచ్‌బీలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు స్థానిక పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు అక్కడికి వచ్చి పరిశీలించగా మృతుడి వద్ద లభించిన ఆధారాల ద్వారా శ్రీనివాస్‌గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం మృతుడి కుమార్తె వనం స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంగళసూత్రం స్నాచింగ్

బంజారాహిల్స్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో ఉన్న మంగళ సూత్రం చోరీకి గురైంది. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 11లో నివాసముండే శ్రీవిద్య, రమణ దంపతులు. వీరికి ఒక కుమార్తె. ఈనెల 11న కుమార్తెను బస్టాప్‌లో దింపేందుకు ద్విచక్రవాహనంపై బయలు దేరారు. ఏఎస్ఆర్ సెంటర్‌కు చేరుకోగానే ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు శ్రీవిద్య మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు మంగళసూత్రం లాక్కొని పారిపోయారు. బా ధితురాలి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట గృహంపై దాడి.. 9 మంది అరెస్టు

మాదాపూర్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పేకాట గృహంపై పోలీసులు దాడులు నిర్వహించి తొమ్మిది మందిని అరెస్టు చేసి రూ. 2.71లక్షలు స్వాధీనం చేసుకున్నారు. మాదాపూర్ చంద్రనాయక్ తండాలో ఓ అపార్ట్‌మెంట్‌లో పేకాట ఆడుతున్నట్టు పోలీసులు తెలుసుకున్నారు. శుక్రవారం దాడులు నిర్వహించి జూద గృహం నిర్వాహకుడు ముద్దాల వెంకట కృష్ణారావుతో పాటు మరో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2.71లక్షలు, 9 మొబైల్ ఫోన్‌లు, ప్లేయింగ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. మాదాపూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ కార్పొరేటర్‌పై కేసు

కార్వాన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గుడిమల్కాపూర్ మాజీ కార్పొరేటర్ బంగారు ప్రకాష్, అతడి అనుచరులపై ఆసిఫ్‌నగర్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం మధ్యాహ్నం బీజేపీ పార్టీలో చేరేందుకు బంగారు ప్రకాశ్ తన అనుచరులతో కలిసి గుడిమల్కాపూర్ నుంచి ర్యాలీగా బయలుదేరారు. ర్యాలీకి అనుమతి లేకపోవడంతో ఎన్నికల అధికారి గాంధీ ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ప్రకాష్‌తో పాటు పలువురిపై ఆసిఫ్‌నగర్ పోలీసు లు కేసు నమోదు చేశారు.

పార్కింగ్ స్థల విషయంలో గొడవ

● కత్తితో దాడిచేసిన ఇద్దరి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): బార్ అండ్ రెస్టారెంట్‌లో పార్కింగ్ స్థల విషయంలో గొడవ పడిన ఘటనలో కత్తితో దాడిచేసిన ఇద్దరు పాత నేరస్థులను సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. బార్కస్ ప్రాంతానికి చెందిన షేక్ సాజిద్(28) పాత నేరస్థుడు. ఇతడిపై 9 కేసులున్నాయి. బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. భవానీనగర్‌కు చెందిన షేక్ అమీర్ అలియాస్ అమ్ము అలియాస్ ఏటీఎం(37) ఆటోడ్రైవర్. ఇతడు కూడా 3 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. వారిద్దరూ ఈనెల 9వ తేదీన నాగులచింత క్రాస్ రోడ్స్‌లో ఉన్న వైన్ బార్ అండ్ రెస్టారెంట్‌కు వెళ్లారు. అదే సమయంలో బార్ నుంచి మద్యం తాగి పార్కింగ్‌లోకి పవన్ అనే వ్యక్తి వచ్చాడు. వీరిద్దరికి.. పవన్‌కు మధ్య చిన్న విషయంలో గొడవ జరిగింది. గొడవ పెరిగి పెద్దది కావడంతో సాజిద్, అమీర్ చాకుతో పవన్‌పై దాడిచేశారు. దాడిలో పవన్ గొంతు, చెవికి గాయాలయ్యాయి. గమనించిన వైన్ బార్ ఉద్యోగి శ్రీనివాస్ వీరిని వారించే ప్రయత్నం చేయగా, సాజిద్, అమీర్ అతడిపైనా దాడి చేశారు. శ్రీనివాస్ ముఖంపై గాయమైంది. అనంతరం వీరిద్దరూ అక్కడి నుంచి పారిపోయారు. మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్‌లో ఈ ఘర్షణపై కేసు నమోదయింది. శుక్రవారం సాజిద్, అమీర్‌లను సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని, మొఘల్‌పురా పోలీసులకు అప్పగించారు.

వైన్‌షాప్ వద్ద ఘర్షణ.. ఆరుగురికి గాయాలు

కార్వాన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గుడిమల్కాపూర్‌లోని ఓ వైన్‌షాప్ వద్ద గురువారం రాత్రి ఘర్షణ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గుడిమల్కాపూర్‌లోని ఓ వైన్‌షాప్ పక్క స్థలంలో చేపల వ్యాపారి అభిలాష్ వద్దకు మద్యం మత్తులో ఉన్న స్వామి వచ్చి గొడవ పడ్డాడు. దాంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటుండగా, ఇద్దరికీ సంబంధించిన మరికొందరు రెండు గ్రూపులుగా ఏర్పడి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో ఆరుగురికి గాయాలయ్యా యి. సమాచారం అందుకున్న ఆసిఫ్‌నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడిని రైలు ఢీకొనడంతో తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ సమీపం లో శుక్రవారం జరిగింది. సికింద్రాబాద్ రైల్వేహెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా చర్లపల్లికి చెందిన గుల్లం నర్సింహ(80) చర్లపల్లి-ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ మధ్యలో రైలు పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొంది. బలమైన గాయాలు కావడంతో స్థానికు లు గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మరణించాడని రైల్వేపోలీసులు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు..

చందానగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొన్ని ఓ మహిళ, మరో వ్యక్తి మృతి చెందారు. ఈ సంఘటన లింగంపల్లి రైల్వేస్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శేరిలింగంపల్లి మండలం చందానగర్ డివిజన్ శాంతినగర్‌లో నివాసం ఉండే రంగమ్మ(57) కూరగాయల వ్యాపారి. బుధవారం మధ్యాహ్నం పాపిరెడ్డి కాలనీలో వారాంతపు సంతలో కూరగాయలు అమ్మడానికి ఇంటి నుంచి బయలుదేరి వెళ్లింది. చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేట్రాక్ దాటుతుండగా బేగంపేట నుంచి వికారాబాద్ వెళ్లే రైలు ఢీ కొంది. దీంతో ఆమెకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● మరో సంఘటనలో..

లింగంపల్లి, చందానగర్ రైల్వేస్టేషన్ మధ్య గుర్తు తెలియని వ్యక్తి(46) మృతి చెందాడు. లింగంపల్లి నుంచి బేగంపేటకు వెళ్లే రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలిసిన సీఆర్‌పీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి తరలించారు.

బాలికను పెళ్లి చేసుకున్న యువకుడిపై పోక్సో కేసు

బర్కత్‌పుర, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బాలికను ప్రేమించి పెళ్లి చేసుకున్న యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్టు కాచిగూడ ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపారు. హబీబ్‌నగర్‌కు చెందిన బాలాజీ (22) కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఓ బాలికను ప్రేమించి ఆరు నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. దీనిపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో బాలాజీపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దేశం అభివృద్ధి చెందాలంటే.. మళ్లీ మోదీ ప్రధాని కావాలి

● రోడ్ షోలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

సనత్‌నగర్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది, ప్రపంచంలో మరింత గౌరవం పెరగాలంటే మరోసారి నరేంద్రమోదీ ప్రధాని కావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి కిషన్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లలో ఆయన రోడ్‌షో నిర్వహించారు. సనత్‌నగర్‌లోని నెహ్రూనగర్, అమీర్‌పేట సత్యం చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో కిషన్‌రెడ్డి ప్రసంగించారు. దేశ భవిష్యత్తు, పేదల సంక్షేమం కోసం ప్రజలు బీజేపీకి ఓటేయాలని అభ్యర్థించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో శాంతిభద్రతలు పెరిగాయని, కర్ఫ్యూలు, మతకల్లోలాలు, ఎటువంటి గొడవలు లేకుండా ప్రజలు ప్రశాంత జీవనం సాగిస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో దేశంలో అరాచకం పెరిగి ఘర్షణలతో శాంతి భద్రతలకు విఘాతం కలిగిన విషయం అందరికీ తెలిసందేనన్నారు. మొఘల్ పాలకులు దండయాత్రలు చేసి, రామమందిరాన్ని కూల్చివేశారని, అటువంటి 500ఏళ్ల సమస్యను పరిష్కరించి రామమందిరాన్ని కట్టించిన ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. దేశంలో ఏ సమస్య ఉన్నప్పటికీ పరిష్కరించే శక్తి మోదీకే ఉందన్నారు. ప్రస్తుతం దేశంలో ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రధానిగా మోదీ పేరే వినిపిస్తోందన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటేయాలని కోరారు. రోడ్‌షోలో కిషన్‌రెడ్డి వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యాంసుందర్, రాష్ట్ర కార్యదర్శి ఆకుల విజయ, కార్పొరేటర్ కేతినేని సరళ, సీనియర్ నాయకులు వెల్లాల రామ్మోహన్, దయానంద్, మూల రవీందర్, నియోజకవర్గ కన్వీనర్ శ్రీశైలం గౌడ్, జాయింట్ కన్వీనర్ ఆకుల మహేష్, డివిజన్ అధ్యక్షులు కన్నూరి క్రాంతి కుమార్, ఎస్.శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్‌షోలో మాట్లాడుతున్న కిషన్ రెడ్డి



బోజిరెడ్డికి కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

తెలంగాణలో బీజేపీ బలోపేతమవుతోంది

● మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

బంజారాహిల్స్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీజేపీ బలోపేతం అవుతోందని, అన్ని వర్గాల ప్రజలు మోదీ పాలనకు ఆకర్షితులవుతున్నారని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ స్నేహితుడు, బీఆర్ఎస్ నాయకుడు బోజిరెడ్డి శుక్రవారం సాగర్‌సొసైటీలో తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. చింతల రామచంద్రారెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణను బీఆర్ఎస్ అప్పుల కుప్పగా మార్చిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇదే దారిలో వెళ్తోందని ఆరోపించారు. పరిస్థితి ఇలానే ఉంటే భవిష్యత్తులో రాష్ట్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సిన పరిస్థితులు నెలకొన్నా ఆశ్చర్య పోనవసం లేదన్నారు. పేదల కోసం కేంద్రం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. తెలంగాణలో కూడా ప్రజలు మోదీవెంటే ఉన్నారని, మెజారిటీ సీట్లలో విజయ ఢంకా మోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గడ్డం వెంకటస్వామి, మహిపాల్‌రెడ్డి, గందె అరుణ్‌కుమార్, దేరంగుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమిని ప్రశాంతంగా జరుపుకోవాలి

● ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న శ్రీరామ నవమిని ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి సూచించారు. శుక్రవారం జంగమ్మెట్ మార్కెట్, రవీందర్‌నాయక్ నగర్, హనుమాన్ టెంపల్ తదితర ప్రాంతాల్లో ఇన్‌స్పెక్టర్ పర్యటించారు. శ్రీరామనవమి ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులను కలిసి కార్యక్రమ విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ వెంట ఎస్‌ఐ నాగరాజు, స్థానిక కాలనీ ప్రెసిడెంట్ ఎ.కృష్ణా నాయక్, శ్రీను, రాజేశ్ తదితరులు ఉన్నారు.

'శోభాయాత్రను జయప్రదం చేయాలి'

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పాతనగర శ్రీరామ సేన ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీరామ నవమి శోభాయాత్రను జయప్రదం చేయాలని అధ్యక్షుడు తాడెం శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉప్పుగూడలోని తన కార్యాలయంలో శోభాయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, శ్రీరామ నవమి శోభాయాత్ర ఏప్రిల్ 17న సాయంత్రం 4.30 గంటలకు తానాజీ నగర్ నుంచి ప్రారంభమవుతుందన్నారు. శోభాయాత్రలో మల్కాజ్‌గిరి, హైదరాబాద్, చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థులు ఈటెల రాజేందర్, మాధవీలత, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో తాడెం మాణిక్ ప్రభు, పి.లక్ష్మణ్, వేణు, శ్రీనివాస్‌చారి, రవి, శివ, రుక్మిణీ పాల్గొన్నారు.

'పకడ్బందీగా నిర్వహిస్తాం'

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ శోభాయాత్రను అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తామని, అందుకోసం పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తూర్పు మండల డీసీపీ రావుల గిరిధర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం డీసీపీ కార్యాలయంలో కార్పొరేటర్ రాకేశ్ జైశ్వాల్, బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షులు వి.పాండు యాదవ్, జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ జి.శంకర్ యాదవ్‌లు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువ కప్పి సత్కరించారు. ఈసందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. శ్రీరామనవమి శోభాయాత్ర, హనుమాన్ జయంతి ర్యాలీని విజయవంతంగా ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని డీసీపీ అన్నారు.

యువకుడికి అరుదైన సర్జరీ

కూకట్‌పల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పదిహేనేళ్ల యువకుడికి ఛాతీ కుడివైపున లోపలికి నొక్కుకుపోవడంతో వైద్యులు అరుదైన సర్జరీ చేసి సరిచేశారు. శ్వాస సమస్యను ఎదుర్కొంటున్న యువకుడు ఇటీవల కూకట్‌పల్లిలోని ఆమోర్ ఆస్పత్రిలో చేరాడు. యువకుడి సమస్యను వైద్య పరిభాషలో పెక్టస్ ఎక్స్‌కవాటమ్‌గా పేర్కొంటారని డాక్టర్ కిషోర్‌రెడ్డి తెలిపారు. ఛాతీతో పాటు ఊపిరితిత్తులు కూడా లోపలికి నొక్కుకుపోయి ఉండడం గమనించి శస్త్రచికిత్స చేశారు. లోపల అవసరమైన చోట్ల మెటల్ బార్లు, రిబ్ ప్లేట్స్ అమర్చి ఎద భాగాన్ని సాధారణ స్థితికి వచ్చేలా చేశారు. కార్డియాక్, వాస్క్యులర్ సర్జన్ కె.అరుణ్, ప్లాస్టిక్ సర్జన్ అభినందన్, ఇతర విభాగాల వైద్యులు జె.శ్రీనివాస్, జయశంకర్, ప్రత్యూష, మహేష్ బృందం ఆపరేషన్ నిర్వహించినట్లు డా.కిషోర్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం రోగి పూర్తిగా కోలుకోవడంతో పాటు శ్వాస సమస్య నుంచి బయటపడ్డాడని ఆయన వివరించారు.

డిగ్రీలో నచ్చిన సబ్జెక్టులను ఎంచుకునేలా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ మేధావుల వేదిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ వీరస్వామి

పంజాగుట్ట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా తెలంగాణలో వివిధ సబ్జెక్టులలో డిగ్రీ చదవాలనుకునే విద్యార్థులకు మూసపద్ధతిలో కాకుండా ఒక సబ్జెక్ట్ ప్రధానంగా, మరో రెండు సబ్జెక్టులు ఎంచుకునేలా అవకాశం కల్పించాలని తెలంగాణ మేధావుల వేదిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.వీరస్వామి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వేదిక కార్యదర్శి చింతకింది కుమార స్వామి, కోశాధికారి అక్కినపల్లి వెంకటేశ్వర్లతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో డిగ్రీ కోర్సుల విధానంలో మూడు విభాగాలు బీఎస్సీ, బీఏ, బీకాంలు ఉండగా నూతన విద్యావిధానంలో వీటి స్థానంలో ఒక సబ్జెక్ట్ ప్రధానంగా, ఏవైనా మరో రెండు సబ్జెక్టులు ఎంచుకొని చదువుకునేలా మార్పులు తేవాలన్నారు.విదేశాల్లో ఈ విద్యా విధానం ఉండగా, ప్రస్తుతం ఓ ప్రైవేట్ విశ్వవిద్యాలయం ఈ విధానాన్ని ప్రారంభించిందన్నారు. విద్యార్థి సైన్స్ సబ్జెక్టు మాత్రమే కాకుండా తనకు నచ్చిన వేరే సబ్జెక్టులను కూడా చదువుకోవచ్చని, పరీక్ష పాస్ అయిన తరువాత బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ పేరుతో సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. డిగ్రీలో చదివిన సబ్జెక్టుతో సంబంధం లేకుండా పీజీలో ఏ సబ్జెక్టులోనైనా ఎంట్రెన్స్ రాసే అవకాశం కల్పించాలన్నారు. పదో తరగతి వరకు ఏవిధంగా కామన్ సబ్జెక్టులు ఉన్నాయో అదేవిధంగా పెట్టాలన్నారు. ఈ మేరకు సీఎం కార్యాలయంలో వినతిపత్రం కూడా అందజేశామని తెలిపారు. సమావేశంలో వేదిక సభ్యులు బి.సుభాష్, యశ్వంత్, ఉదయ్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



దానంకు మద్దతు ఇస్తున్న రెడ్డి సంఘాల నాయకులు

దానంకు రెడ్డి సంఘాల మద్దతు

బంజారాహిల్స్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్‌లో కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతు ఇస్తున్నట్టు రెడ్డి సంఘాలు ప్రకటించాయి. సంఘ నాయకులు బంజారాహిల్స్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం దానం నాగేందర్‌ను కలిసి మద్దతు ఇస్తున్నట్టు చెప్పారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ... అన్ని వర్గాల సమస్యలపై పోరాటం చేసే సత్తా కేవలం దానంకు మాత్రమే ఉందన్నారు. త్వరలోనే ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్టు చెప్పారు. దానంను కలిసిన వారిలో భూదాన్ రాంచంద్రారెడ్డి కుమారుడు అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ ప్రమోతిష్ చంద్రారెడ్డి, ఎస్. హరినాథ్‌రెడ్డి, టీపీసీసీ ఓబీసీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్ సుభాష్, రెడ్డి జేఏసీ మహిళా అధ్యక్షురాలు దేవి రెడ్డి విజితారెడ్డి ఉన్నారు.

ఉత్సాహంగా ఉగాది పద్య నాటకోత్సవాలు

బంజారాహిల్స్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఫిలింనగర్ ఫిలింఛాంబర్ ఆవరణలోని రామానాయుడు కళామండపంలో పొత్తూరి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉగాది పద్య నాటకోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ నాటకోత్సవాలను తిలకిస్తున్న సినీ, టీవీ, కళాభిమానులు పరవశించిపోతున్నారు. పద్యనాటకోత్సవాల్లో భాగంగా శుక్రవారం సత్యహరిశ్చంద్ర నాటకాన్ని శ్రీనివాస చైతన్య కళానాట్య మండలి రంగస్థల నటులు ప్రదర్శించారు. ఆద్యంతం ప్రేక్షకులను కట్టిపడేసేలా వీరు నాటకాన్ని ప్రదర్శించారు. గయోపాఖ్యానం యుద్ధసీనులో శ్రీకృష్ణుడిగా కుమారి ధూపం తిరుమల తేజ, అర్జునుడిగా ధూపం రామకృష్ణ ప్రదర్శించారు. వారణాసి హరిగా బద్వేలు కిరణ్‌కుమార్, కాటిసీను హరిగా కుంచి దాసుబాబు, నక్షత్రగా ఏఎల్.ప్రసాద రాయచౌదరి, చంద్రమతిగా అడపా ప్రభావతి, కాలకౌశికగా దర్శి శ్రీనివాసరావు, కేశవగా నారాయణ రావు, లోహితగా బాల శుభశ్రీ నటించగా వీరికి హార్మోనిస్ట్‌గా ఉయ్యూరి నాగేశ్వర్‌రావు, మైక్ తుర్లపాడ శ్రీను, డోలక్ రామకృష్ణ సహకారం అందించారు. ఈ సందర్భంగా పలువురు సినీ రచయితలు, సినీ ప్రముఖులు ఈ నాటకాన్ని వీక్షించి కళాకారులను అభినందించారు.



సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శనలో కళాకారులు

కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ మైనార్టీ చైర్మన్‌గా మహమ్మద్ మోసిన్ ఖురేషి



ఎర్రగడ్డ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా మైనార్టీ విభాగం చైర్మన్‌గా ఎర్రగడ్డకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ మొహసిన్ ఖురేషి నియమితులయ్యారు. ఈమేరకు ఏఐసీసీ మైనార్టీ విభాగం వైస్ చైర్మన్, తెలంగాణ ఇన్‌చార్జి ఫరహా ఆజ్మీ శుక్రవారం మొహమ్మద్ మోసిన్ ఖురేషికి నియామక పత్రం అందజేశారు. మొహమ్మద్ మోసిన్ ఖురేషి భార్య నౌషిన్ బేగం రెండు పర్యాయాలు ఎర్రగడ్డ కార్పొరేటర్‌గా నిలబడ్డారు. ఈ సందర్భంగా మహమ్మద్ మోసిన్ మాట్లాడుతూ... సికింద్రాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నాయకులను ఏకతాటిపై నడిపించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన మహమ్మద్ అజారుద్దీన్, ఎం.అనిల్‌కుమార్ యాదవ్, తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గురుద్వారాలో ఘనంగా వైశాఖీ ఉత్సవాలు

అమీర్‌పేట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): అమీర్‌పేటలోని గురుద్వారా ప్రబంధక్ కమిటీ ఆధ్వర్యంలో వైశాఖీ ఉత్సవాలను ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే వేడుకల్లో భాగంగా తొలిరోజైన శుక్రవారం అమృత్ సంచార్ (హోలీ బాప్టిజం) కార్యక్రమాన్ని నిర్వహించారు. సిక్కు మత గురువులు (రాగి జత్థాస్) గుర్బాణి కీర్తనలు ఆలపిస్తూ గురుగ్రంథాన్ని పఠిస్తూ అమృత్‌పాన్ (పవిత్ర పానీయం)ను తయారు చేశారు. సిక్కు మత సంప్రదాయాలను పాటిస్తూ, సిక్కు మతాన్ని అధికారికంగా అంగీకరించేందుకు ముందుకొచ్చిన వారికి ఈ పానీయాన్ని అందజేశారు. హోలీ బాప్టిజంగా పేర్కొనే ఈ క్రతువు ద్వారా సిక్కు యువతి, యువకులు, పిల్లలు, మహిళలు అమృత్‌పాన్‌ను స్వీకరించారు. ప్రబంధక్ కమిటీ గురుద్వారా సాహెబ్ అధ్యక్ష, కార్యదర్శులు సర్దార్ దర్శన్‌సింగ్, సర్దార్ సురేందర్‌సింగ్, ఉపాధ్యక్షులు సర్దార్ కుశ్వంత్‌సింగ్, సర్దార్ లాహోర్ సింగ్, చైర్మన్ సర్దార్ అజిత్ సింగ్ తదతరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. గురుద్వారాకు వచ్చిన భక్తులు, బాటసారులకు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గురుద్వారా సభ్యులు, స్థానికులు షర్బత్, మంచినీటిని పంపిణీ చేశారు.



మహిళలకు హోలీ బాప్టిజం ఇస్తున్న గురువులు

కుషాయిగూడలో చైన్‌స్నాచర్ అరెస్ట్

● రూ. ఐదున్నర లక్షల విలువైన మూడు బంగారు గొలుసులు, ద్విచక్రవాహనం స్వాధీనం

ఏఎస్‌రావునగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న ఓ చైన్‌స్నాచర్‌ను శుక్రవారం కుషాయిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతడి నుంచి రూ.5.58లక్షల విలువైన 6.7తులాల మూడు బంగారు గొలుసులను, ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కుషాయిగూడ ఏసీపీ మహేష్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. వరంగల్ జిల్లా హన్మకొండ ఇందిరానగర్‌కు చెందిన పుట్టా హరికృష్ణ(38) జీవనోపాధి కోసం భార్య, పిల్లలతో నగరానికి వలస వచ్చి మేడిపల్లి మండలం చెంగిచర్లలోని ఓ ప్రైవేటు స్కూల్ ఆవరణలో నివాసం ఉంటున్నాడు. కారు డ్రైవర్‌గా పనిచేసే హరికృష్ణ చెడు అలవాట్లకు బానిసై, కుటుంబ పోషణ భారమై సులభంగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశ్యంతో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడడం మొదలుపెట్టాడు. ఈ నెలలో 3, 7, 8 తేదీలలో కుషాయిగూడ, కీసర, సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని వివిధ ప్రాంతాలలో రోడ్లపై నడుచుకుంటూ వెళ్తున్న ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని వారి మెడలోని బంగారు గొలుసులను లాక్కెళ్లాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టి చెంగిచర్లలోని అతడి ఇంటి వద్ద అరెస్ట్ చేశారు. కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బందిని ఏసీపీ మహేష్ ఈ సందర్భంగా అభినందించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ జి.వీరస్వామి, బి.రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



రహ్మత్‌నగర్‌కు చెందిన జోసెఫైన్‌కు మంజూరైన రూ. 1.55 లక్షల సీఎం సహాయనిధి ఎల్‌ఓసీ పత్రాన్ని అందిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి
- యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి)

సందడిగా సినీ సంగీత విభావరి

చిక్కడపల్లి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాంస్కృతిక సంస్థ శ్యామగాయత్రి ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో శుక్రవారం రాత్రి నూతన గాయనీగాయకులతో పాటు వర్ధమాన గాయకులు కలిసి నాటి నేటి సినీ పాటల ఆలాపనతో సందడి చేశారు. ముఖ్య అతిథిగా ప్రముఖ పారిశ్రామికవేత్త చిల్ల రాజశేఖరరెడ్డి పాల్గొని మాట్లాడుతూ శ్యామగాయత్రి సంస్థ నిర్వాహకురాలు శివపార్వతి శాస్త్రీయ సంగీత గురువు అని వైవిధ్యం కోసం సినీ పాటల విభావరి ఏర్పాటు చేశారని పేర్కొంటూ ఆమెను సత్కరించారు. అధ్యక్షత వహించిన కళాపోషకుడు గుదిబండి వెంకటరెడ్డి మాట్లాడుతూ శివపార్వతి సంగీత సేవను ప్రశంసించారు. ప్రముఖ గాయకుడు త్రినాథరావు, నాదయోగ కల్చరల్ ఆర్గనైజేషన్ స్థాపకుడు గణపతి పాల్గొనగా సంస్థ కార్యదర్శి చేపూరి లక్ష్మి నివేదిక సమర్పించగా అధ్యక్షురాలు శివపార్వతి స్వాగతం పలికారు.



శివపార్వతిని సన్మానిస్తున్న చిల్ల రాజశేఖరరెడ్డి, వెంకటరెడ్డి



పద్మారావుకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న ప్రబంధక్ కమిటీ సభ్యులు

వైశాఖి ఉత్సవాలకు ఆహ్వానం

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్‌ను అమీర్‌పేట్ గురుద్వారా ప్రబంధక్ కమిటీ సభ్యులు శుక్రవారం ఆయన నివాసంలో కలిశారు. శనివారం నిర్వహించే బైశాఖి ఉత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానపత్రం అందజేశారు.

పాలీసెట్‌కు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పేద విద్యార్థుల కోసం ఉచిత పాలీసెట్ ఆన్‌లైన్ శిక్షణ ఇస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షులు తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి వీరేష్ తెలిపారు. ఆదివారం 14వ తేదీన మహబూబ్ కాలేజ్‌లో అంబేడ్కర్ జయంతి కార్యక్రమం అనంతరం ఉచిత శిక్షణ ప్రారంభ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పదిహేను సంవత్సరాలుగా పాలీసెట్ ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.



ఆర్పీఎస్ సిబ్బందికి సూచనలిస్తున్న ప్రాజెక్ట్ అధికారి రజనీకాంత్

ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి

● రజనీకాంత్

అడ్డగుట్ట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో ఎక్కడా చెత్త వేయకుండా ఉండేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని జీహెచ్ఎంసీ యూసీడీ ప్రాజెక్ట్ అధికారి రజనీకాంత్ ఆర్పీఎస్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం డివిజన్‌లో యూసీడీ సిబ్బంది పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ చెత్త వ్యాన్ వస్తుందని, ఎవరూ కూడా రోడ్లపై చెత్త వేయకుండా కాలనీ, బస్తీ ప్రజలకు ఆర్పీఎస్ సిబ్బంది ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఆర్పీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి



నర్సింహ (ఫైల్)

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : రైలు పట్టాల వెంట నడుచుకుంటూ వెళుతున్న వృద్ధుడిని రైలు ఢీకొనడంతో గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం... మేడ్చల్ జిల్లా చర్లపల్లికి చెందిన గుల్లం నర్సింహ (80) చర్లపల్లి-ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ మార్గమధ్యలో రైలు పట్టాల వెంట నడుచుకుంటూ వెళుతుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొని బలమైన గాయాలతో పడి ఉండగా, స్థానికులు వైద్యపరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మరణించాడని రైల్వే పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. .

కాలేజీకి వెళ్లిన విద్యార్థిని అదృశ్యం



సాయిదీప్తి

బౌద్ధనగర్, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): కాలేజీకి వెళ్లిన విద్యార్థిని అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సబిత తెలిపిన వివరాల ప్రకారం సీతాఫల్‌మండి వీరయ్య గల్లీకి చెందిన ఎన్‌వీ సాయిదీప్తి (18) పద్మారావునగర్‌లోని ఓ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుంది. ఈనెల పదవ తేదీన కాలేజీ వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన సాయిదీప్తి తిరిగి ఇంటికి చేరుకోలేదు. సెల్‌ఫోన్ స్విచాఫ్ రావటంతో సాయిదీప్తి కోసం పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో ఆమె తండ్రి డీవీశ్రీనివాస్ తనకుమార్తె కనిపించటంలేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు సీనియర్ సిటిజన్స్‌కు ఆటల పోటీలు

చిలకలగూడ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): హెల్దీ సీనియర్ సిటిజన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ 5వ వార్షికోత్సవం పురస్కరించుకుని సీనియర్ సిటిజన్స్‌కు పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శులు ఆర్.పి. భగవాన్, ఎం.ఆర్.పి.బాబు ఒక ప్రకటనలో తెలిపారు. 55సంవత్సరాల నుంచి 100సంవత్సరాల వయస్సు పైబడిన వారికి వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్లు, సికింద్రాబాద్, రైల్ నిలయం, రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏప్రిల్ 13వ తేది శనివారం ఉదయం 7గంటలకి ప్రారంభమవుతాయని పరుగు పందెం, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, డిస్కస్‌త్రో, షాట్ పుట్, జావెలిన్, హ్యామర్‌త్రోలలో పోటీలు వుంటాయని, విజేతలకి సర్టిఫికెట్‌తో పాటు మెడల్ అందజేయనున్నట్లు బయట నుంచి వచ్చే వారికి వసతి సౌకర్యం వుందని పేర్కొన్నారు.

భగవద్గీత పఠనం ఉచిత శిక్షణా శిబిరం

వనస్థలిపురం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, వనస్థలిపురం భక్త సమాజం సంయుక్త నిర్వహణలో భగవద్గీత పఠనం ఉచిత శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు వనస్థలిపురం భక్త సమాజం అధ్యక్షుడు సీ.హెచ్.వీ.ఆర్.కే మూర్తి తెలిపారు. ఏప్రిల్ 23 నుంచి మే 9వరకు వేసవి సెలవుల్లో 14 సంవత్సరాలు పైబడిన విద్యార్థులు, గృహిణులు, యువకులు, పెద్దవారు ఈ శిక్షణా శిబిరంలో పాల్గొనవచ్చన్నారు. ప్రతి రోజు సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు వనస్థలిపురంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఏప్రిల్ 20తేదిలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్లు. 7801001166, 9247836302, 8919416798లలో సంప్రదించాలని ఆయన కోరారు.







శ్రీరామనవమి సందర్భంగా తాడ్‌బండ్‌లోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. వెలుగుల్లో ధగధగలాడుతున్న ఆలయాన్ని చిత్రంలో చూడవచ్చు

దేశం అభివృద్ధి చెందాలంటే ..

మళ్లీ మోదీ ప్రధాని కావాలి

● సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి కిషన్ రెడ్డి



రోడ్‌షోలో కిషన్ రెడ్డి

సనత్‌నగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది, ప్రపంచంలో మరింత గౌరవం పెరగాలంటే మరోసారి నరేంద్ర మోదీ ప్రధానిగా ఎన్నిక కావాల్సిన అవసరముందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి కిషన్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సాయంత్రం సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లలో రోడ్‌షో నిర్వహించారు. సనత్‌నగర్‌లోని నెహ్రూనగర్, అమీర్‌పేట సత్యం చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో ప్రసంగించారు. దేశ భవిష్యత్తు, పేదల సంక్షేమం కోసం ప్రజలు బీజేపీకి ఓటెయ్యాలని అభ్యర్థించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో శాంతిభద్రతలు పెరిగాయని, కర్ఫ్యూలు, మతకల్లోలాలు, ఎటువంటి గొడవలు లేకుండా ప్రజలు ప్రశాంత జీవనం సాగిస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో దేశంలో అరాచకం పెరిగి ఘర్షణలతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. మొఘల్ పాలకులు దండయాత్రలు చేసి, రామమందిరాన్ని కూల్చివేశారని, అటువంటి 500 ఏళ్ల సమస్యను పరిష్కరించి రామమందిరాన్ని కట్టించిన ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. దేశంలో ఏ సమస్య ఉన్నప్పటికీ పరిష్కరించే శక్తి మోడీకే ఉందన్నారు. ప్రస్తుతం దేశంలో ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రధానిగా మోదీ పేరే వినిపిస్తున్నదన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటెయ్యాలని కోరారు.

రోడ్‌షోలో కిషన్‌రెడ్డి వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యాంసుందర్, రాష్ట్ర కార్యదర్శి ఆకుల విజయ, కార్పొరేటర్ కేతినేని సరళ, సీనియర్ నాయకులు వెల్లాల రామ్మోహన్, ఇ.దయానంద్, మూల రవీందర్, నియోజకవర్గ కన్వీనర్ శ్రీశైలంగౌడ్, జాయింట్ కన్వీనర్ ఆకుల మహేష్, డివిజన్ అధ్యక్షులు కన్నూరి క్రాంతికుమార్, ఎస్.శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న కుషాయిగూడ ఏసీపీ మహేష్

కుషాయిగూడలో చైన్‌స్నాచర్ అరెస్ట్

● రూ. ఐదున్నర లక్షల విలువైన మూడు బంగారు గొలుసులు,

● ద్విచక్రవాహనం స్వాధీనం

ఏఎస్‌రావునగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న ఓ చైన్‌స్నాచర్‌ను శుక్రవారం కుషాయిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతడి నుంచి రూ.5.58లక్షల విలువైన 6.7తులాల మూడు బంగారు గొలుసులను, ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కుషాయిగూడ ఏసీపీ మహేష్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. వరంగల్ జిల్లా హన్మకొండ ఇందిరానగర్‌కు చెందిన పుట్టా హరికృష్ణ(38) జీవనోపాధి కోసం భార్యా, పిల్లలతో నగరానికి వలస వచ్చి మేడిపల్లి మండలం చెంగిచర్లలోని ఓ ప్రైవేటు స్కూల్ ఆవరణలో నివాసం ఉంటున్నాడు. కారు డ్రైవర్‌గా పనిచేసే హరికృష్ణ చెడు అలవాట్లకు బానిసై, కుటుంబ పోషణ భారమై సులభంగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశ్యంతో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో ఈ నెలలో 3, 7, 8 తేదీలలో కుషాయిగూడ, కీసర, సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని వివిధ ప్రాంతాలలో రోడ్లపై నడుచుకుంటూ వెళ్తున్న ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని వారి మెడలోని బంగారు గొలుసులను లాక్కెళ్లాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టి చెంగిచర్లలోని అతడి ఇంటి వద్ద అరెస్ట్ చేశారు. కేసును ఛేదించి, నిందితుడిని అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బందిని ఏసీపీ మహేష్ ఈ సందర్భంగా అభినందించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ జి.వీరస్వామి, బి.రాజు నాయక్ పాల్గొన్నారు.



విజయలక్ష్మికి నియామక పత్రం అందజేస్తున్న సబితారెడ్డి

బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ఉపాధ్యక్షురాలిగా విజయలక్ష్మి

సరూర్‌నగర్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ఉపాధ్యక్షురాలిగా మీర్‌పేట్ కార్పొరేషన్‌కు చెందిన మాజీ వార్డు సభ్యురాలు, పార్టీ సీనియర్ నాయకురాలు పాలపర్తి విజయలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు మాజీ మంత్రి పి.సబితారెడ్డి ఆమెకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో చేవెళ్లలో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ, రథోత్సవాలు ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాటసింగారంలో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ, రథోత్సవాలు శుక్రవారం విఘ్నేశ్వరపూజ, మహాభిషేకంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. 13న ఉదయం ప్రత్యేక పూజల అనంతరం 11.15గంటలకు గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. 14న ఉదయం 5గంటలకు దిష్టికుంభం, 5.30గంటలకు వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం, 9గంటలకు పోలేరమ్మ బోనాలు ఉంటాయని తెలిపారు.

అమీర్‌పేట గురుద్వారాలో వైశాఖీ ఉత్సవాలు ప్రారంభం



అమృత్ పాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు హోలీ బాప్టిజం ఇస్తున్న మతగురువులు

అమీర్‌పేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేటలోని గురుద్వారా ప్రబంధక్ కమిటీ ఆధ్వర్యంలో వైశాఖి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. మూడు రోజులపాటు నిర్వహించే వేడుకల్లో భాగంగా తొలిరోజైన శుక్రవారం అమృత్ సంచార్ (హోలీ బాప్టిజం) కార్యక్రమాన్ని నిర్వహించారు. సిక్కు మత గురువులు (రాగి జత్థాస్) గుర్బాణీ కీర్తనలు ఆలపిస్తూ గురు గ్రంథాన్ని పఠిస్తూ అమృత్‌పాన్ (పవిత్ర పానీయం)ను తయారు చేశారు. సిక్కు మత సంప్రదాయాలను పాటిస్తూ, సిక్కు మతాన్ని అధికారికంగా అంగీకరించేందుకు ముందుకువచ్చిన వారికి ఈ పానీయాన్ని అందజేశారు. హోలీ బాప్టిజంగా పేర్కొనే ఈ క్రతువు ద్వారా సిక్కు యువతీ, యువకులు, పిల్లలు, మహిళలు అమృత్‌పాన్‌ను స్వీకరించారు. పవిత్ర పానీయాన్ని తీసుకున్నవారు జీవితాంతం సిక్కు మత నిబంధనలైన కేశ్, కడా, కంగా, కృపాణ్, కచేరాగా పేర్కొనే అయిదు నిబంధనలు విధిగా పాటించాల్సి ఉంటుందని సిక్కు మతగురువులు వెల్లడించారు. ప్రబంధక్ కమిటీ గురుద్వారా సాహెబ్ అధ్యక్ష, కార్యదర్శులు సర్దార్ దర్శన్‌సింగ్, సర్దార్ సురేందర్‌సింగ్, ఉపాధ్యక్షులు సర్దార్ కుశ్వంత్‌సింగ్, సర్దార్ లాహోర్‌సింగ్, చైర్మన్ సర్దార్ అజిత్‌సింగ్ తదితరులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు. గురుద్వారాకు వచ్చిన భక్తులు, బాటసారులకు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గురుద్వారా సభ్యులు, స్థానికులు షర్బత్, మంచినీటిని పంపిణీ చేశారు.



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసిన మైనారిటీ సోదరులు

ముస్లింలకు ఎమ్మెల్యే రంజాన్ శుభాకాంక్షలు

మారేడుపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఎంతో నిష్ఠతో నెల రోజులపాటు ఉపవాస దీక్షలు చేసి పవిత్రంగా, సంతోషంగా జరుపుకొనే పండుగ రంజాన్ అని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రంజాన్ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని బన్సీలాల్‌పేట, బేగంపేట డివిజన్లకు చెందిన పలువురు ముస్లింలు శుక్రవారం వెస్ట్ మారేడుపల్లిలోని నివాసంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బన్సీలాల్‌పేటకు చెందిన అబ్బాస్, రజాక్, జహంగీర్, సాబేర్, వాహెబ్, శ్రీహరి, కిషోర్, లక్ష్మీపతి, లంక రాజు, నాగభూషణం, కుషాల్ తదితరులు ఉన్నారు.

నేడు బౌద్ధనగర్ డివిజన్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పర్యటన

బౌద్ధనగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి శనివారం సాయంత్రం బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్లలో పర్యటిస్తారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రవి ప్రసాద్‌గౌడ్ తెలిపారు. సాయంత్రం 5 గంటలకు వారాసిగూడ అన్నపూర్ణ మెస్ నుంచి ప్రారంభమయ్యే పాదయాత్ర బౌద్ధనగర్, పార్శిగుట్ట, వారాసిగూడ ఇందిరానగర్‌కాలనీ, సీతాఫల్‌మండి, బీదలబస్తీ, శ్రీనివాసనగర్, చిలకలగూడ వరకు సాగుతుందని తెలిపారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధికసంఖ్యలో ఈ పాదయాత్రలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

రేపు అయ్యప్పస్వామి విసుకాని ఫెస్టివల్

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని అయ్యప్పస్వామి ఆలయంలో పంచగిరివాస అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం విసుకాని ఫెస్టివల్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసందర్భంగా ఉదయం 6గంటలకు గణపతి హోమం, 7గంటలకు అష్టాభిషేకం, సాయంత్రం దీపారాధన, హరివరాసనం కార్యక్రమాలు జరగనున్నాయి. అయ్యప్పస్వామి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న రైల్వే పోలీసులు

రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు

సికింబ్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపధ్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైల్వే ఎస్పీ సలీమా డీఎస్పీ వాజీద్‌ల ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ తెలిపారు. రైల్వే స్టేషన్‌కు వచ్చే ప్రయాణికుల బ్యాగుల్ని క్షుణ్ణంగా తనిఖీలు చేశామని, అదేవిధంగా పార్శిల్ కార్యాలయం, వెయిటింగ్ హాళ్ల ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించామన్నారు. తనిఖీల్లో జీఆర్పీ ఎస్సైలు మాజీద్, రమేష్, కానిస్టేబుల్ హరిలాల్‌లతో పాటుసిబ్బంది పాల్గొన్నారు.



ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్‌ను చూపిస్తున్న బస్తీవాసులు

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

ఆందోళనలో స్థానికులు

అడ్డగుట్ట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట డివిజన్‌లోని ఇంటి (నెంబరు 10-5-789/1) సమీపంలో రోడ్డు పక్కనే తెరిచి ఉన్న మ్యాన్‌హోల్ కారణంగా బస్తీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. విద్యార్థులతో పాటు బస్తీకి చెందిన చిన్నపిల్లలు ఉండటంతో జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడంలేదని బస్తీవాసులు బక్కూరి నర్సింగ్‌రావు, నాగరాజు, వినోద్, నయిముద్దీన్, రాజ్యలక్ష్మిలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారిందని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా ఉందని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అల్వాల్ హైటెన్షన్ రోడ్డులో అక్రమ నిర్మాణాలు

● అనుమతులకు విరుద్ధంగా అంతస్తులు ● సెట్‌బ్యాక్ లేని కట్టడాలు ● ఎలాంటి చర్యలు తీసుకోని విజిలెన్స్ అధికారులు

అల్వాల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కూకట్‌పల్లి జోన్‌లోని అల్వాల్ సర్కిల్ పట్టణ ప్రణాళికా విభాగంలో అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. అల్వాల్ హైటెన్షన్ రోడ్డులోని అల్వాల్‌హిల్స్, సిటిజన్స్ కాలనీ, పంచశీల కాలనీ తదితర ప్రాంతాలలో అక్రమ నిర్మాణాల సంఖ్య వందలలో ఉన్నాయి. "జీ ప్లస్ టూ" అనుమతులు పొంది అక్రమంగా సెల్లార్ సబ్ సెల్లార్‌తో పాటు మూడు, నాలుగు అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నారు. అధికారులు, సిబ్బంది ప్రోత్సాహంతోనే జరుగుతున్న అక్రమ కట్టడాలపై విజిలెన్స్ అధికారులు సైతం ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు.



అల్వాల్ హైటెన్షన్ రోడ్డులో సెట్‌బ్యాక్‌లు పాటించకుండా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తోన్న వాణిజ్య సముదాయం

అడ్డూ, అదుపూ లేకుండా...

వ్యాపార వాణిజ్య సముదాయాల నిర్మాణం కోసం అల్వాల్ సర్కిల్ పరిధిలో ప్రత్యేక జోన్‌లు లేకున్నప్పటికీ ముఖ్యంగా అల్వాల్ హైటెన్షన్ రోడ్డులో రెసిడెన్షియల్‌గా అనుమతులు తీసుకుని వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నారు. అల్వాల్ హిల్స్, హెచ్ఎంటీకాలనీ, సిటిజన్స్ కాలనీ, పంచశీల కాలనీల్లో ప్రస్తుతం గజం ధర రూ.1.5లక్షలు పలుకుతోంది. ఇదే అదునుగా భావించి భవన నిర్మాణదారులు జీహెచ్ఎంసీ అధికారుల సహకారంతో అక్రమంగా ఐదంతస్తుల భవనాలను నిర్మిస్తున్నా అధికారులు మౌనం వహించడం సందేహాలకు తావిస్తోంది. వంద గజాలైన నాలుగు నుంచి అయిదు అంతస్తులకు తగ్గకుండా సెల్లార్, సబ్‌సెల్లార్‌తో అక్రమ నిర్మాణాలు చేపట్టడం సర్వసాధారణంగా మారింది. ముఖ్యంగా ప్రధాన రోడ్లపై యథేచ్ఛగా కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారుల నియంత్రణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయి. అగ్నిప్రమాదాలు జరిగితే కనీసం ఫైర్ ఇంజన్‌లు వెళ్లడానికి కూడా దారి లేని పరిస్థితులున్నాయి. నిషేధమైనప్పటికీ సెల్లార్లలోనే వ్యాపారాలు నిర్వహిస్తుండటం గమనర్హం.

అధికారుల కనుసన్నల్లోనే...

అల్వాల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఒక ఏసీపీ లేదా డీసీపీ, ముగ్గురు సెక్షన్ ఆఫీసర్లు, ముగ్గురు చైన్‌మెన్‌లు ఉండాల్సి ఉండగా వీరిలో ఉన్న ఒక డీసీపీకి బండ్లగూడ మున్సిపాలిటీ అదనపు బాధ్యతలు అప్పగించారు. సర్కిల్ మొత్తానికి ఒకే సెక్షన్ అధికారి ఉన్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సైతం స్థానిక అధికారులు, అక్రమ నిర్మాణాలతో మిలాఖత్ అయి తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న అభియోగాలూ వినిపిస్తున్నాయి. అయితే వీరిపై రాజకీయ, సామాజిక సంఘాల ఒత్తిడి కూడా పనిచేస్తుందని తెలుస్తోంది. అక్రమ నిర్మాణాలపై ఎవరైనా అధికారులకు ఫిర్యాదు చేస్తే సదరు నిర్మాణదారుడితో ఫిర్యాదుదారుడికి రాజీ కుదిర్చి తమ పని కానిస్తున్నారన్న ఆరోపణలు సైతం వినవస్తున్నాయి.

అగ్ని ప్రమాదాలు జరిగితే భారీగా ఆస్తినష్టం

సెట్‌బ్యాక్‌లు లేకుండా జనావాసాల్లో భవనాలు నిర్మించి వాటిని వాణిజ్య సముదాయాలకు ఇస్తే ఆయా భవనాల ప్రాంగణాల్లోకి ఫైర్ ఇంజన్‌లు వెళ్లే పరిస్థితి ప్రస్తుతం లేదు. నిబంధనల మేరకు సెట్‌బ్యాక్‌లు లేకుండా నిర్మిస్తుండటమే ఇందుకు కారణం. ముందు అగ్నిప్రమాదాలు జరిగితే భారీగా ఆస్తినష్టంతో సహా ప్రజల ప్రాణాలకు ముప్పు ఉంటుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటున్నాం

అల్వాల్ హైటెన్షన్ రోడ్డులో నిర్మిస్తోన్న అక్రమ నిర్మాణాలతో పాటు సెట్‌బ్యాక్‌లు లేకుండా నిర్మిస్తోన్న నిర్మాణాలను గుర్తించి నోటీస్‌లను జారీ చేస్తున్నాం. కొన్ని నిర్మాణాలను కూల్చివేశాం. నిబంధనలు పాటించకుండా నిర్మించిన భవనాలను గుర్తించి సంబంధిత యజమానులపై చర్యలు చేపడతాం.

- శ్రీనివాస్‌రెడ్డి,
డిప్యూటీ కమిషనర్ అల్వాల్ సర్కిల్